లక్ష్యం ఎటు వైపు..!

జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహణలో వర్సిటీలు వెనకబడుతున్నాయా? సదస్సుల ఫలాలు సమాజానికి అందుతున్నాయా? అంటే .. లేదని మేధావి వర్గాల నుంచి వస్తున్న చేదుమాట. పలు వర్సిటీలలో మొక్కుబడి సదస్సులు నిర్వహిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఫలితంగా వర్సిటీ సామర్థ్యాన్ని నిర్ధారించే నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(నాక్) గుర్తింపులోనూ, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లోనూ వర్సిటీలు పురోగతి సాధించడం లేదని బోధపడుతోంది.



ఎస్వీ యూనివర్సిటీ



పద్మావతి యూనివర్సిటీ

- వర్సిటీలలో తగ్గుతున్న జాతీయ, అంతర్జాతీయ సదస్సులు
- తిరుపతిలో పలు వర్సిటీలలో నత్తనడకన సదస్సుల నిర్వహణ
- 2025లో లక్ష్యం చేరుకునేనా..?
- నత్తనడకన సదస్సులు, వర్క్‌షాపులు

తిరుపతి సిటీ: తిరుపతిలో ఐదు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఒక్కో యూనివర్సిటీలో 30 నుంచి 60వరకు ప్రధాన విభాగాలున్నా పేరొందిన విభాగాలు మాత్రమే నామమాత్రంగా సదస్సులు నిర్వహిస్తున్నాయి. సాధారణంగా వర్సిటీలోని ప్రతి విభాగం నుంచి విద్యా సంవత్సరంలో కనీసం ఒకటి నుంచి రెండు జాతీయ, అంతర్జాతీయ సదస్సులతో పాటు వర్క్‌షాపులను నిర్వహించాల్సి ఉంది. అప్పుడే పరిశోధన, విస్తరణ, విద్యా ప్రమాణాలు వర్సిటీలలో మెరుగు పరచుకునేందుకు అవకాశం ఉంటుంది. సదస్సుల నిర్వహణలో వైఫల్యం చెందడంతోనే వివిధ వర్సిటీలకు ఇప్పటికీ నాక్-ఏ గ్రేడ్ గుర్తింపు పొందలేదనే విమర్శలు ఉన్నాయి. ఎస్వీ వెటర్నరీ, వేదిక్ వర్సిటీలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, వర్క్‌షాపుల నిర్వహణలో బాగా వెనుకబడ్డాయని గణాంకాలు పరిశీలిస్తే స్పష్టమవుతోంది.

2024లో పలు వర్సిటీలలో జరిగిన సదస్సులు, వర్క్‌షాపుల వివరాలు

యూనివర్సిటీ	జాతీయ, అంతర్జాతీయ సదస్సులు	వర్క్‌షాపులు	మొత్తం
ఎస్వీ యూనివర్సిటీ	18	10	28
పద్మావతి మహిళా వర్సిటీ	22	10	32
ఎస్వీ వెటర్నరీ వర్సిటీ	4	4	8
జాతీయ సంస్కృత వర్సిటీ	11	9	20
ఎస్వీ వేదిక్ వర్సిటీ	3	4	7

నిర్వహించిన సదస్సులపైనా విమర్శలు

వర్సిటీలలో జాతీయ, అంతర్జాతీయ సదస్సులను తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని, సదస్సులకు స్పాన్సర్లు అవసరమైన సహాయ సహకారాలు ఇస్తున్నా సదస్సు నిర్వాహకులు మాత్రం లక్షల్లో బిల్లులు పెట్టుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు సంబంధిత డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఒక్కో విద్యార్థి నుంచి వెయ్యి నుంచి రూ.2వేలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

లక్ష్యం వైపు పయనించేనా..!

సదస్సులు.. ప్రధానంగా సంబంధింత సబ్జెక్ట్‌లపై నూతన పరిశోధనలపై దేశవ్యాప్త నిపుణులతో చర్చించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పలు వర్సిటీలలో చేస్తున్న పరిశోధనలు, వాటి సారాంశంపై పరిశోధన పత్రాలను సమర్పించడం, అధునాత టెక్నాలజీతో సంబంధిత రంగాన్ని అనుసంధాన ఫలితాలు, నెట్‌వర్క్ విధానం, పరిశోధనల వ్యాప్తి, అంతర్జాతీయ దృక్పథం, సహాయసహకారాలు అందిపుచ్చుకోవడం, పలు అంశాలపై అవగాహన ఒప్పందాలను కుదుర్చుకోవడంలో ప్రధాన భూమిక పోషిస్తాయి.

సదస్సులను పెంచేందుకు..



ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో ఇప్పటి వరకు ఆరుకు పైగా జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించాం. వర్క్‌షాపులు సైతం వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలో జరుగుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రణాళికా బద్ధంగా సదస్సులు నిర్వహించి, పరిశోధనలపై మరింత పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తాం. నాక్ ఏ గ్రేడ్ సాధన దిశగా వర్సిటీ అడుగులు వేస్తోంది.

-ప్రొఫెసర్ జీవీ.రమణ, వీసీ, వెటర్నరీ వర్సిటీ

సదస్సుల నిర్వహణలో ముందున్నాం



మేము జాతీయ, అంతర్జాతీయ సదస్సులతో పాటు వర్క్‌షాపులు క్రమం తప్పకుండా నూతన అంశాలపై నిర్వహిస్తున్నాం. సదస్సుల నిర్వహణలో వర్సిటీ ముందంజలో ఉంది. దేశవ్యాప్తంగా పలు వర్సిటీల నుంచి పరిశోధకులను సదస్సులకు ఆహ్వానించి చర్చిస్తున్నాం. అంతర్జాతీయ స్థాయిలో సైతం నిపుణులను ఆహ్వానించి సదస్సులు నిర్వహిస్తున్నాం. గత ఏడాది సుమారు 32కు పైగా సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహించాం. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ మెరుగు పరచుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం

-ప్రొఫెసర్ వీ.ఉమ, వీసీ, మహిళా వర్సిటీ

పరిశోధనలకు పెద్ద పీట



ఎస్వీయూలో సదస్సులను లక్ష్యం వైపు నడిపిస్తున్నాం. నూతన పరిశోధనలపై పలు వర్సిటీ పరిశోధకులతో ప్రధాన అంశాలపై జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తున్నాం. సదస్సుల నిర్వహణలో అలసత్వం, అవినీతికి ఏమాత్రం స్థానం లేదు. ఇప్పటికే వర్సిటీలో 28వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి సదస్సులు, పలు విభాగాల ఆధ్వర్యంలో వర్క్‌షాపులు నిర్వహించాం. మరిన్ని సదస్సుల నిర్వహణకోసం ప్రయత్నిస్తాం.

-ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు, వీసీ, ఎస్వీయూ

సంస్కృత భాషాభివృద్ధే ధ్యేయంగా సదస్సులు



జాతీయ సంస్కృత వర్సిటీలో సంస్కృత భాషాభివృద్ధే ధ్యేయంగా జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తున్నాం . గత ఏడాది దేశవ్యాప్తంగా పలువురు నిపుణులు, మేధావులను ఆహ్వానించి సుమారు 20కిపైగా సదస్సులు నిర్వహించాం. ప్రతి సదస్సును ఛాలెంజ్‌గా తీసుకుని నిర్వహిస్తుండటంలో మంచి ఫలితాలు సాధించి లక్ష్యం వైపు వర్సిటీ పయనిస్తోంది .

-ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వీసీ, జాతీయ సంస్కృత వర్సిటీ

ప్రతి నెలా సదస్సు నిర్వహణకు యత్నం



వేదిక్ వర్సిటీలో పరిశోధనలను ప్రొత్సహించే దిశగా సదస్సులు నిర్వహిస్తున్నాం. వచ్చే విద్యాసంవత్సరం నుంచి మరిన్ని జాతీయ,అంతర్జాతీయ సదస్సులు ప్రతి నెలా నిర్వహించేలా ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే దేశవ్యాప్తంగా పలువురు పండితులను ఆహ్వానించి వర్క్‌షాపులు, సదస్సుల ద్వారా పరిశోధనలపై చర్చించాం. సదస్సులు గత ఏడాది తక్కువగా నిర్వహించామనడం సరి కాదు.

-ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి, వీసీ, ఎస్వీ వేదిక్ వర్సిటీ

క్లుప్తంగా

చక్కని రాతకే మంచి మార్కులు

పాకాల: చదువుతో పాటు విద్యార్థులకు చిన్నతనం నుంచి మంచి చేతి రాతను నేర్పించాలని ఎంఈఓ-2 లింగయ్య అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాలలో చక్కని చేతిరాత కార్యక్రమం నిర్వహించారు. లింగయ్య మాట్లాడుతూ, విద్యార్థులు ఎంత బాగా చదివినా, చదివిన దానికి అంతే అందంగా పరీక్షలలో రాసినప్పుడే మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. సరైన మార్కులు సాధించలేకపోవడానికి చక్కని చేతిరాత లేకపోవడం కూడా ఒక కారణమన్నారు. విద్యార్థులకు మంచి చేతిరాతను నేర్పించడానికి నెల్లూరు నుంచి గోపికృష్ణ నియమించారని, దీనికయ్యే ఖర్చును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు భరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు మురళి, శ్రీధర్, రామకృష్ణ, శ్రీదేవి పాల్గొన్నారు.

బాలరాముని ఆరాధనోత్సవం



తిరుపతి కల్చరల్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ దేశంలోనున్న ఆలయాల్లో బాలరాముని ఆరాధనోత్సవం నిర్వహించాలని ఇచ్చిన పిలుపు మేరకు కాపు వీధిలోని రామాలయంలో బుధవారం బాలరాముని ఆరాధనోత్సవం వేడుకగా నిర్వహించారు. రాముల వారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. బాలరాముని వేషధారణలో కళాకారుడు అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నేత గుండాల గోపీనాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మునిక్రిష్ణయ్య, వాసుస్వామి, కోటేశ్వరరావు, జితేంద్ర శర్మ, ఆదిలక్ష్మి, నిర్మల, లీలావతి, నరసింహ, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించరూ!

– జేసీకి యూటీఎఫ్ వినతి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతి పత్రం అందజేసి యూటీఎఫ్ నాయకులు మాట్లాడారు. 12వ పీఆర్సీ చైర్మన్‌ను తక్షణం నియమించాలని, పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పీఆర్సీ, సీపీఎస్ తదితర ఆర్థిక బకాయిలన్నీ చెల్లించేందుకు రోడ్ మ్యాప్‌ను ప్రకటించాలని కోరారు. 2003 ఉద్యోగ నియామకం పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాత పెన్షన్ వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ముత్యాలరెడ్డి, నాయకులు దండు రామచంద్రయ్య, ఎం.కుమారస్వామి, కె.మోహన్‌బాబు, దేవరాల నిర్మల పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటారని..



తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో జరిగిన అంతర్‌వర్సిటీ కళాశాల క్రీడాపోటీలలో ప్రతిభ చాటిన పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థినులకు స్పోర్ట్స్ మెరిట్ క్యాష్ అవార్డులను ఎస్వీయూ ప్రకటించింది. బుధవారం వర్సిటీ నుంచి అందిన క్యాష్ అవార్డు చెక్కులను ప్రిన్సిపల్ టి. నారాయణమ్మ విద్యార్థినులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ, డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థినులు వై.మానస, బి.నందిని, ఈ. గౌరీ ప్రియ, డిగ్రీ సెకండ్ ఇయర్ విద్యార్థినులు వి.నేత్ర, పి.స్వాతి, ఎల్. హర్షితకు రూ.6వేల చొప్పున ఎస్వీయూ అవార్డులు ప్రకటించిందన్నారు. ఆ విద్యార్థినులను ప్రిన్సిపల్‌తోపాటు పాటు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ భారతి, డాక్టర్ కే.ఉమారాణి, డాక్టర్ కేపీ పద్మజ, డాక్టర్ బీ.లక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు పి.ప్రవల్లిక అభినందించారు.

గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి

తిరుపతి గాంధీ రోడ్డు: గిడుగు రామ్మూర్తి పంతులు 85వ వర్ధంతి పురస్కరించుకుని బుధవారం బీజేపీ నేతలు ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళి అర్పించారు. నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాల ముందు బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాడుక భాషలో ప్రజలకు పరిచయం చేసిన తెలుగు భాషా పితామహుడు గిడుగు అని ఆయన సేవలను కీర్తించారు. బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్, లోక ప్రభాకర్, కొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, జయలక్ష్మి, కళాకారులు కేఎన్ రాజా పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలి

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ నగర మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, తిరుపతి జిల్లాలో సత్యవేడు నియోజవర్గంలోనున్న సెజ్‌లోజిల్లా వాసులకు కాకుండా ఇతర రాష్ట్రాల నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం సరికాదన్నారు.

అలాగే టీటీడీలో ఖాళీ గా ఉన్న పోస్టుల భర్తీలో తిరుపతి జిల్లా స్థానికులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, విక్రమ్, వివిధ ప్రజా సంఘాల నేతలు పద్మనాభరెడ్డి ,ఉదయ్‌కుమార్, హరికృష్ణ, మోహన్, నాగభూషణం, నాగరాజు, ఎస్‌కే.బాషా పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీ అనుబంధ విభాగాల నియామకం

తిరుపతి మంగళం: వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ తిరుపతి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం వెల్లడించింది. ఈ మేరకు తిరుపతి నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడిగా లక్కాకుల దినేష్, జి.కోటీశ్వరమ్మ (మహిళా విభాగం), తండ్ల మోహన్‌యాదవ్ (బీసీ సెల్), చచ్చర్ల మురళి (ఎస్సీ సెల్), శివ శంకర్ (ఎస్టీ సెల్), మహమ్మద్ ఖాసీం (మైనారిటీ సెల్), అరవ ఆమోస్ బాబు (క్రిస్టియన్ మైనారిటీ సెల్), పీఎస్ఆర్ చిద్విలాస రెడ్డి (విద్యార్థి విభాగం), ఎం.వెంకటరెడ్డి (మున్సిపల్ వింగ్), పి.సోమేశ్వర్ రెడ్డి (ఆర్‌టీఐ వింగ్), ఎన్.కోదండ ఆచారి (వాలంటీర్స్ వింగ్), మద్దాలి శేఖర్ (గ్రీవెన్స్ సెల్), ఎన్.శివ (వాణిజ్య విభాగం), ఎస్.ధనంజయ్ (వీవర్స్ వింగ్), సప్తగిరి రాజ (వైఎస్ఆర్ టీయూసీ), సాయి పద్మజ (అంగన్‌వాడీ వింగ్), రాజశేఖర్ (లీగల్ సెల్), వెంకటయ్య (కల్చరల్ వింగ్), బచ్చు ప్రకాష్ (సోషల్ మీడియా వింగ్), శైలేష్ రెడ్డి (ఐటీ వింగ్), సద్దా బాలక్రిష్ణ యాదవ్ (దివ్యాంగుల వింగ్), డాక్టర్ చైతన్య (డాక్టర్స్ వింగ్), శివశంకర్‌రెడ్డి (ఇంటలెక్చువల్ ఫోరం వింగ్), రమణారెడ్డి (పబ్లిసిటీ వింగ్), ముప్పాల సాయి కుమారి (బూత్ కమిటీ వింగ్) నియమితులయ్యారు.

ప్రభుత్వ సబ్సిడీతో ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తులు

తిరుపతి తుడా: తిరుపతిలో సొంత స్థలం కలిగి ఉండి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద ప్రభుత్వ సబ్సిడీ ద్వారా సొంతంగా ఇల్లు నిర్మించుకోవడానికి నగరంలో అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి నగరపాలక కమిషనర్ ఎస్.మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంఏవై 2.0 పథకం కింద ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రూ. 2.50 లక్షల ప్రభుత్వ సబ్సిడీ పొంది సొంతంగా ఇల్లు నిర్మించుకోవడానికి ఆసక్తి ఉన్న లబ్ధిదారులు సమీపంలోని సంబంధిత వార్డు సచివాలయంలో అమెనిటి సెక్రటరీని కలసి, ఆధార్, రేషన్, పాన్ కార్డులు, కులం, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, ల్యాండ్ డాక్యుమెంట్స్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ మొదలైన వాటిని సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు

జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 11 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పినట్లు కోర్టు సూపరింటెండెంట్ ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపారు. మద్యం తాగి నగరంలో నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

పరిశుభ్రతలో భాగస్వాములు కండి

- కమిషనర్ మౌర్య
- కాలువల్లో చెత్త వేస్తున్నారని దుకాణదారులపై మండిపాటు


మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని దుకాణ, వాణిజ్య సముదాయాలు, గృహాలలో విధిగా చెత్త బుట్టలను వినియోగించి నగర పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. నగరంలోని రాయల్ నగర్, మారుతి నగర్, రైతు బజారు, ముత్యాలరెడ్డిపల్లె కూడలి, వెస్ట్ చర్చి తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం కమిషనర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాల వద్ద చెత్త రోడ్లపైనే వేస్తుండడం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ, తనిఖీ చేసిన పలు ప్రాంతాల్లోని దుకాణదారులు చెత్త బుట్టలు వినియోగించకుండా, చెత్తను కవర్లలో వేసి కాలువల్లో పడేస్తున్నారని, ఇలా చేయడం వలన కాలువల్లో చెత్త పేరుకుపోయి, మురుగు నీరు రోడ్లపైకి వచ్చి, అపరిశుభ్రంగా అవుతున్నాయన్నారు. ఇకపై అలా చేస్తే దుకాణదారులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రాయల్ నగర్‌లోని తుడా పార్కును పరిశీలించి శుభ్రంగా ఉంచాలని, ఆట పరికరాలు మరమ్మతులు చేయించాలని తుడా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, తుడా ఈఈ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శలు


అచ్చెమ్మకు నివాళులు అర్పిస్తున్న పెద్దిరెడ్డి

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డి తల్లి అచ్చమ్మ (92), మండల రైతు నాయకుడు రఘునాథరెడ్డి తండ్రి రెడ్డెప్పరెడ్డి (104) మృతి చెందారు. ఆ రెండు కుటుంబాలను పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే సోద రుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి పరామర్శించారు. అచ్చమ్మ, రెడ్డెప్పరెడ్డి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి, ఎమ్మార్సీ రెడ్డి, ఎంపీపీ యుగంధర్ రెడ్డి, సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




శతాధిక వృద్ధుడి కుటుంబాన్ని పరామర్శిస్తూ.. రెడ్డెప్పరెడ్డి, అచ్చెమ్మకు చిత్ర పటాలకు నివాళులు

27న వీధి వ్యాపారులతో భారీ ఆందోళన

- అధికారులే కడుపు కొడుతున్నారని ఏఐటీయూసీ విమర్శ
- వీధి విక్రయదారుల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్: వీధి వ్యాపారులపై నగర పాలక సంస్థ కమిషనర్ వైఖరి మారాలని, సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ 2014 వీధి విక్రయదారుల చట్టాన్ని అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం గంధమనేని శివయ్య భవన్‌లో వీధి వ్యాపారుల ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ , కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల జీవనోపాధి, రక్షణ, క్రమబద్ధీకరణ చట్టంను 2014లో తెచ్చిందన్నారు. జీవో 137 ద్వారా దీనికి సంబంధించిన నిబంధనలు 2017లో అమల్లోకి వచ్చాయన్నారు. అయితే వీటిని అమలు చేయాల్సిన అధికారులే వారి కడుపు కొడుతుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న కార్పొరేషన్ కార్యాలయం వద్ద వీధి వ్యాపారులతో పెద్ద ఎత్తున ఆందోళన చేయనున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.శివకుమార్, ఏఐటీయూసీ నేత ఎన్‌డీ.రవి, బాలాజి, కేవై.రాజా, శ్రీనివాసులు, సరిత, బాషా, రూప, మల్లిఖార్జున, రమేష్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ విడుదల


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ వృక్ష శాస్త్ర విభాగం, పారంపర్య వైద్య మహాసంఘం సంయుక్తంగా 'సాంప్రదాయ ఔషధం: ఆధునిక, సహజ చికిత్సల ఏకీకృత విధానం' అనే అంశంపై ఏప్రిల్ 9 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం వీసీ అప్పారావు తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. సంప్రదాయ వైద్యంలో ఉపయోగించే మందుల ఫార్ములాను భావి తరాలకు అందించడమే సదస్సు ధ్యేయమని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సీడీసీ డీన్ కేసీ రాయుడు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కేటీ రామకృష్ణారెడ్డి, డాక్టర్ కామేశ్వరరావు బద్రి, నిర్వాహకురాలు డాక్టర్ జే. కామాక్షమ్మ పాల్గొన్నారు.

గాయకుడు ఉమాపతికి అవార్డు


అవార్డు అందుకుంటున్న సోము ఉమాపతి

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన ప్రముఖ గాయకుడు, కవి సోము ఉమాపతికి వేటూరి సుందర రామ్మూర్తి జాతీయ ఐకాన్ అవార్డు లభించింది. ఈయన సంగీతం, సాహిత్య రంగంలో చేస్తున్న కృషిని గుర్తించి అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో వివిధ రంగాలకు చెందిన వారిని సత్కరించింది. వారిలో సోము ఉమాపతిని వేటూరి పురస్కారంతో సత్కరించారు.

రూ.25కోట్లు మంజూరు చేస్తే పెండింగ్ పనులు పూర్తి

- స్మార్ట్ సిటీ పనులపై ఎమ్మెల్యేకు అధికారుల వినతి
- కలసికట్టుగా నగరాభివృద్ధికి కృషి చేయాలన్న ఆరణి

తిరుపతి తుడా: తిరుపతి నగరాభివృద్ధికి అందరూ కలసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. స్మార్ట్ సిటీ, తుడాలో అభివృద్ధి పనులపై బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మౌర్య అధ్యక్షతన ఎమ్మెల్యే సమీక్షించారు. 19 స్మార్ట్ సిటీ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి పూర్తి చేయడానికి నిధులు అవసరమని, తక్షణం రూ.25 కోట్లు మంజూరు చేస్తే ఆ పెండింగ్ పనులు పూర్తవుతాయని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వాటాను చెల్లించడంతో మున్సిపల్ శాఖకు కేంద్రం నిధులు విడుదల చేసిందని పేర్కొన్నారు. శెట్టిపల్లె భూ సమస్య సీఎం, డిప్యూటీ సీఎం చొరవతో త్వరలోనే పూర్తిగా పరిష్కారమవుతుందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం శెట్టిపల్లెను తిరిగి తుడా పరిధిలోకి తిరిగి తీసుకొస్తోందన్నారు. తిరుపతి అభివృద్ధి సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రాయలచెరువు రోడ్డు రైతు బజార్‌ను ఆనుకుని నిర్మిస్తున్న తుడా టవర్స్‌ను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, తుడా సెక్రటరీ వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజనీర్లు కష్ణారెడ్డి, శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ జీఎం.చంద్రమౌళి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, తిరుపతి నగరపాలక సంస్థ, తుడా ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

హథీరాంజీ మఠాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

తిరుపతి కల్చరల్: హథీరాంజీ మఠాన్ని బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సందర్శించారు. 120 ఏళ్ల కిందట మఠం భవనాన్ని నిర్మించినట్లు ఇంజనీర్ అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. మఠం బిల్డింగ్ పటిష్టతపై నిపుణులు ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నరసింహాచారి, ఆర్‌సీ.మునికృష్ణ, సునీల్ చక్రవర్తి, కోదండ, లోకేష్, ఎన్‌డీఏ నేతలు నరసింహ యాదవ్, వరప్రసాద్ పాల్గొన్నారు.


చంద్రగిరి: సీసీ రోడ్ల నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నాని

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

చంద్రగిరి: మండలంలోని తొండవాడ పంచాయతీ హౌసింగ్ కాలనీను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే నాని అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలసి సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, తొలి విడతగా రూ.12.85 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించామని, జూలైలోపు కాలనీలో సీసీ రోడ్లు పూర్తి చేస్తామన్నారు. కాలనీలో మౌలిక సదుపాయాలను కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎమరాల్డ్స్‌లో ఉద్యోగ నైపుణ్య శిక్షణ


ఉద్యోగ నైపుణ్య శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో విద్యార్థులు, నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సౌజన్యంతో చెన్నైకి చెందిన ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో ఫైనలియర్ డిగ్రీ విద్యార్థులకు ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయిబిలిటీ పేరిట ఉద్యోగ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ మునిరత్నం మాట్లాడుతూ, నెలరోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలోబ్యాంకింగ్, ఐటీ, ఇన్‌ఫ్రా కమ్యూనికేషన్ తదితర అంశాల్లో నైపుణ్యం పెంపొందించేలా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఐసీటీ అకాడమీ ప్రతినిధులు నాగేశ్వరరావు, ప్రశాంత్ మాట్లాడారు. విద్యార్థులు ఇలాంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగాలు పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ మదన్‌మోహన్, శ్రీనివాసులురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.